# కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలే

- బీఆర్ఎస్ పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం
- ఉద్యమానికి వరంగల్ కేంద్రం
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- కేసీఆర్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారు
- 50 వేల మెజార్టీతో గెలుస్తా
- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్, చిత్రంలో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ, అక్టోబర్ 27 : కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రైతులకు మళ్లీ కరెంటు కష్టాలు తప్పవని, టార్చ్ లైట్లు కొనుక్కొని పొలాల వద్దకు పోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాకతీయ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించే ముందు చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి వినోద్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మూడోసారి జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. మలి దశ తెలంగాణ ఉద్యమానికి వరంగల్ నగరం, కేయూ కేంద్ర బిందువుగా మారిందన్నారు. సమైక్యపాలనలో తెలంగాణ దగాపడిందనారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు చేసి రాష్ట్రం సిద్ధించే వరకు పోరాటాలు చేశామన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అంటున్నారని... టీఆర్ఎస్(ఇప్పటి బీఆర్ఎస్) అన్ని పార్టీల మద్దతు కూడగట్టి పోరాడి ఒత్తిడి తేవడంతోనే రాష్ట్రం సిద్ధించిందన్నారు. 2001 నుంచి తెలంగాణ ఇస్తామని రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. ఆ పార్టీ విధానాలతోనే శ్రీకాంతాచారి ఆత్మహత్యతో పాటు అనేక మంది బలిదానాలు చేసుకున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ సీఎం తెలంగాణ వస్తే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాలని అన్న విషయాన్ని వినోద్‌కుమార్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రాష్ట్ర రైతులకు మళ్లీ కరెంటు కష్టాలు రావడం ఖాయమన్నారు. టీపీపీసీ అధ్యక్షుడు రేవంతర్‌రెడ్డి రైతులకు 3గంటలకు కరెంటు చాలని అనడం రైతులను మోసం చేయడమేనన్నారు. 2014కు ముందు తెలంగాణను, ఇప్పటి తెలంగాణలో జరిగిన అభివృద్ధిపై ప్రజలు, మేధావులు విశ్లేంచాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో పోచంపహాడ్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు మాత్రమే కట్టారని, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గోదావరి, కృష్ణా నదులపై ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు మిషన్ కాకతీయ ద్వారా 44వేల చెరువులకు మరమ్మతు చేపట్టామన్నారు. తద్వారా భూ గర్భజలాలు పెరిగాయన్నారు. సీఎం కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడు కావడంతోనే తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని చూసి ఇతర దేశాలు, రాష్ట్రాల ప్రతినిధులు ఆశ్చర్యపోతున్నారన్నారు. ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణలో 93లక్షల తెల్ల రేషన్ కార్డులున్నాయని, వీరందరికీ కేసీఆర్ బీమా వర్తింపజేస్తామన్నారు. ప్రభుత్వం దవాఖానల్లో మౌళిక వసుతులు కల్పించి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వరంగల్ నగరంలో 24 అంతస్తులతో దవాఖాన నిర్మిస్తున్నట్లు తెలిపారు. కరోనా కష్టకాలంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా తెలంగాణలో పథకాలు ఆగిపోలేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని 1.33 లక్షల ఉద్యోగాలను తెలంగాణలో ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్, టీడీపీలు నియమించిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో అన్ని వర్గాలకు న్యాయం చేసేలా ఉందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ప్రజలు నగరంలో జరిగిన అభివృద్ధిని చూడాలని వినోద్‌కుమార్ కోరారు.

**50 వేల మెజార్టీతో గెలుస్తా**

ముఖ్యమంత్రి కేసీఆర్ తనను బిఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజక వర్గం అభ్యర్థిగా ప్రకటించడం సంతోషకరమని, ప్రజలు కూడా అలాగే ఆదరిస్తున్నారని చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఏ వాడకెళ్లినా ప్రజలు ఎంతగానో ఆదరించి, ఆశీర్వదిస్తున్నారన్నారు. ప్రతిచోట ప్రభుత్వ లబ్ధిదారులు ఎందరో ఉన్నారని, పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. 2009 నుండి ఇప్పటి వరకు కేసీఆర్‌కు నమ్మకంగా ఉంటూ పనిచేస్తున్నానన్నారు. డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఎంతగానో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. గతంలో కంటే ఈ సారి 50వేలకు పైచిలుకు మెజార్టీతో గెలుస్తాననే ధీమా వ్యక్తం చేశారు. రెట్టింపు ఉత్సాహంతో అంకితభావంతో ప్రజలకు సేవ చేస్తూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. సమావేశంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్ చీకటి శారద, మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు ఐనవోలు మల్లన్న ప్రసాదం అందజేత


కేసీఆర్‌కు ఐనవోలు మల్లన్న చిత్ర పటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి, మార్నేని

ఐనవోలు, అక్టోబర్ 27 : వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్‌కు ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం ప్రసాదాన్ని వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేశ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అందజేశారు. ప్రజా అశీర్వాద సభలో పాల్గొని మాట్లాడిన అనంతరం ఎమ్మెల్యే అరూరి, డీసీసీబీ మార్నేని ఐనవోలు మల్లికార్జునస్వామి లడ్డూ ప్రసాదం, స్వామి శేష వస్త్రం, స్వామి చిత్ర పటాన్ని సీఎం కేసీఆర్‌కు అందజేశారు.

**కేసీఆర్ నోట ఐనవోలు మాట**

వర్ధన్నపేట సభలో సీఎం కేసీఆర్ ఐనవోలు మండలం పేరు ఉచ్ఛరించడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు. నిండు సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఐనవోలు మండలానికి దేవాదుల నీళ్లు ఇస్తున్నట్లుగా గుర్తు చేయడంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రింగ్ రోడ్డు కోసం ల్యాండ్ పూలింగ్ వల్ల ఎక్కువ శాతం ఐనవోలు రైతులకు నష్టం జరుగుతుందని గతంలో అందోళనలు చేసిన విషయం తెలిసిందే. ప్రజా ఆశీర్వాద సభలో స్వయంగా సీఎం కేసీఆర్ రింగ్ రోడ్డు కోసం ల్యాండ్ పూలింగ్ ఉండదని ప్రకటించడంతో రైతులందరూ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


క్యాతంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

# కాంగ్రెస్, బిజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు

- కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి
- అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి
- జానకీపురం, క్యాతంపల్లి, కేశనగర్ గ్రామాల్లో విస్తృత స్థాయి సమావేశం

ధర్మసాగర్, అక్టోబర్ 27 : తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలులో లేవని, ఆ పార్టీల నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని జానకీపురం, క్యాతంపల్లి, కేశవనగర్ గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కడియం శ్రీహరి హాజరై మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత సీఎంగా పదేళ్ల పరిపాలనలో దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు ఇక్కడ అమలు చేశారన్నారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీ నాయకులు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు ఇక్కడ అమలు చేస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ప్రజలందరూ ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అన్నారు. దేవాదుల ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి సాగు నీరు, మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ రక్షిత మంచినీరు అందిస్తున్నామన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.16 వేలు పంట పెట్టుబడి, ఆసరా ఫించన్లు రూ.5016, సౌభాగ్యలక్ష్మి పథకంలో తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళకు రూ.3000 వేలు, కేసీఆర్ బీమా పథకం, గృహలక్ష్మి, దళిత బంధు పథకాలు అమలు చేస్తారన్నారు. ప్రజలందరూ తనను ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మునిగెల రాజు, జడ్పీటీసీ డా. పిట్టల శ్రీలత, సర్పంచ్‌లు నవ్య, అవనీజ రెడ్డి, మునిగాల శోభ, ఎంపీటీసీలు సోమక్క, శశిరేఖ, మండల రైతు కోఆర్డినేటర్ కరుణాకర్, బీఆర్ఎస్ నాయకులు చాడ నర్సింహారెడ్డి, విప్లవ్ రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, మహేందర్, మొగిలి, నాగరాజు, సదన్ రాజు, రాజేందర్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

# సీఎం సభలో గులాబీ జోష్

*శుక్రవారం భట్టుపల్లిలో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ కార్యకర్తల జోష్ కనిపించింది. సభలో ఆద్యంతం కార్యకర్తలు హుషారుగా కనిపించారు. సీఎం ప్రసంగిస్తున్నంత సేపు ఈలలు వేస్తూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. వేదిక వద్ద రంగులతో పటాకులు పేల్చారు. దీంతో ఆ ప్రాతం గులాబీ మయమైంది.*


సభ ప్రాంగణం వద్ద పటాకులు కాలుస్తున్న కార్యకర్తలు


ప్రజా ఆశీర్వాద సభకు జెండాలతో తరలివస్తున్న నాయకులు, కార్యకర్తలు


కేసీఆర్ ప్రసంగిస్తుండగా కేరింతలు కొడుతున్న కార్యకర్తలు